క్లుప్తంగా

నూతన నియామకం


నర్సింహులు

నారాయణఖేడ్: జాతీయ మానవహక్కుల సామాజిక న్యాయ కమిషన్ ఖేడ్ డివిజన్ శాఖ అధ్యక్షుడిగా నాగల్‌గిద్ద మండలం కారాముంగి గ్రామానికి చెందిన నర్సింహులు నియమితులయ్యారు. నర్సింహులు గతంలో అంబేడ్కర్, పూలే సేవాసమితి ఖేడ్ డివిజన్ అధ్యక్షుడిగా సమస్యల పరిష్కారం, సమాజసేవ కోసం అహర్నిశలు కృషి చేశారు. దీంతో డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్లు సంఘం రాష్ట్ర చైర్మన్ అబ్దుల్‌రహీం, వైస్ చైర్మన్ వై.పండరి తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన కళాకారులు


ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కళాకారులు

నారాయణఖేడ్: విజయోత్సవాల్లో భాగంగా కళాప్రదర్శనలు ఇస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆదివారం ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా కళాజాత ప్రదర్శనల ద్వారా వివరించాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. ఆయనను కలిసినవారిలో కళాకారులు శేఖర్ గౌడ్, మదన్‌సింగ్, రవీందర్, మామిడిసాయిలు, చామంతి, అగమయ్య, రాజు, శశిప్రియ, స్వప్న ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జహీరాబాద్ టౌన్: ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంపాక్ట్ ప్రోగ్రాం రిసోర్స్ పర్సన్ రాజేశ్వర్ పలు విషయాలు వివరించారు. అలవాట్లు, సమయపాలన, బాడీ లాంగ్వేజ్, భావోద్వేగాలు ఎలా నియంత్రించుకోవాలి, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా తట్టుకోవాలి, మంచి ఫలితాలు సాధించడానికి ప్రణాళికలు ఎలా రచించుకోవాలి తదితర విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సంజన, దీపికలు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో గురుస్వామి మల్లికార్జున్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. పూజకు స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప శరణుఘోషతో పండగ వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ నాయకులు దేశ్‌పాండే, రాజశేఖర్‌రెడ్డి, రాజు, ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం ముగింపు, అమావాస్య సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వేకువజాము నుంచే ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వీరభద్రేశ్వరుడు, భద్రకాళీ మాతలను ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి మహాహారతితో నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న, ప్రసాదాలను వితరణ చేశారు.

పోలీసు కృష్టయ్యకు నివాళి

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేటలోని ముదిరాజ్ భవన్ ఆవరణలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన పోలీసు కృష్టయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొని అమరుల త్యాగాలను స్మరించడమంటే వారి ఆశయాలను కొనసాగించడమేనని తెలిపారు.

అపరిశుభ్రంగా ప్రభుత్వ ఆఫీసులు

● కార్యాలయాల్లో లోపించిన పారిశుద్ధ్యం


గ్రంథాలయ ఆవరణలో మద్యం సీసాలు


ఎంపీడీఓ కార్యాలయం వెనుక చెత్తాచెదారం

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం.. నిర్వహణ లోపం.. పట్టింపులేని తనంతో ప్రభుత్వ కార్యాలయ ఆవరణం అపరిశుభ్రంగా మారాయి. ఝరాసంగం మండల ప్రజాపరిషత్తు కార్యాలయం, గ్రంథాలయ ఆవరణ పూర్తిగా చెత్తాచెదారంతో నిండి పారిశుద్ధ్యం లోపించింది. వర్షం నీరు వృథా పోకుండా ఎక్కడికక్కడే ఇంకిపోయేలా నిర్మించిన ఇంకుడు గుంత నిర్వహణ లేక మట్టి దిబ్బలతో నిండిపోయింది. గ్రంథాలయ ఆవరణలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు నిత్యం మండలంలోని కార్యాలయాలకు వివిధ పనులపై వస్తుంటారు. ప్రజలు కార్యాలయాల పరిసరాలు చూసి ఇక్కడే ఈ విధంగా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ.. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బీఆర్‌ఎస్ నాయకుల 'గురుకుల బాట'


ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): మాజీ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో బీఆర్‌ఎస్ నాయకులు గురుకుల బాట కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. వసతి గృహ పరిసరాలను పరిశీలించి, వసతి గృహంలోని సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నారని, చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని తమ పరిశీలనలో గమనించామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శివరాజ్, వీరేశం, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి పడాల సతీష్, కార్యవర్గ బృందం నాయకులు క్రాంతి, వెంకట్, పాండునాయక్, రోషన్, నిఖిల్, అక్షయ్ పాల్గొన్నారు.



ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలను సుందరంగా అలంకరించారు. అమరుల వీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహంను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

– సంగారెడ్డి జోన్

గురుకుల విద్యార్థి అదృశ్యం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయిప్రకాష్(13), కనిపించకుండా పోయాడని ఖేడ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ మొగులయ్య ఆదివారం తెలిపారు. మండలంలోని చందాపూర్‌కు చెందిన సాయిప్రకాష్ శుక్రవారం సాయంత్రం గురుకులం నుంచి బిస్కెట్లు తీసుకువస్తానని తోటి విద్యార్థులకు చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురుకుల ప్రత్యేక అధికారిణి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కృష్ణాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికుడు..


గైని యోహన్

కల్హేర్(నారాయణఖేడ్): బయటకు వెళ్లిన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని కృష్ణాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం.. మండలంలోని కృష్ణాపూర్‌కు చెందిన గైని యోహన్ పారిశుద్ధ్య కార్మికుడుగా పని చేస్తున్నాడు. గత నెల 28న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికిన ఆచుకీ లభించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు కోటి రుద్రాక్షాల ఊరేగింపు

సంగారెడ్డి టౌన్ : జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 2న (సోమవారం) కోటి రుద్రాక్షాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. రుద్రాక్షలను నేపాల్, వారణాసి, ప్రయాగ, మౌరంగి తదితర ప్రాంతాల నుంచి సంగారెడ్డి మండలంలోని పస ల్వాది ఆశ్రమానికి పోతిరెడ్డి పల్లి చౌరస్తా నుంచి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా శాంతినగర్‌కు చెందిన కొండకల్ అంజిరెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ... శాంతినగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అందరిని కలుపుకొని కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు రాజిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, విజయ్, న్యాయవాది నరసింహ, వినోద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నాయకులు దశరథ్ రెడ్డి, కిష్టయ్య పాల్గొన్నారు.

ఘనంగా కార్తీకమాస వనభోజనం


గోపూజ చేస్తున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నైబర్‌హూడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 50 కాలనీలకు ప్రజలు పాల్గొని గోపూజ, ఉసిరి చెట్లుకు ప్రత్యేక పూజ, శ్రీలక్ష్మీ నారాయణ పూజ, తులసి పూజ చేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హూడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ.. ప్రతిఏటా అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. 50 కాలనీల ప్రజలు ఒకచోటకు రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

ఘనంగా బ్రాహ్మణ సంఘం వనభోజనాలు

రామచంద్రపురం మండలం బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అన్నాజీ ఆధ్వర్యంలో బీరంగూడ గుట్టపై వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తీకమాస వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. చిన్నారులతో సంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలభారత బ్రాహ్మణ ఫెడ రేషన్ ఉపాధ్యక్షురాలు శశిరేఖ కులకర్ణి ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. బ్రాహ్మణ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేషాద్రికుమార్, ప్రధాన కార్యదర్శి శేఖర్‌శర్మ, కోశాధికారి మూర్తి, సహ అధ్యక్షుడు రాజేశ్వరి శర్మ, సంయుక్త కార్యదర్శి వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఫణి శర్మ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

హత్య చేసి మృతదేహాన్ని కాల్చిన దుండగులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్, ఎస్‌ఐ సుభాష్ పేర్కొన్నారు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మహిళను హత్య చేసి.. సంఘటన స్థలంలోనే పెట్రోల్ పోసి మృతదేహాన్ని కాల్చివేశారు. స్థానిక రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన వెలుగు చూసింది. పథకం ప్రకారమే దుండగుల మహిళను హత్య చేసినట్లు చెప్పారు. మృతురాలి ఒంటిపైన వెండి కడియాలు చెవుల కమ్మలు ఉన్నాయి. క్లూస్ టీం సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులచే పోస్టుమార్టం చేయించి పూడ్చివేయించామన్నారు. కేసును రెండు మూడు రోజుల్లో ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **టీపీయూఎస్ నూతన కమిటీ ఎన్నిక**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల టీపీయూఎస్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన సమక్షంలో కమిటీ అధ్యక్షుడిగా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా బ్రహ్మం, మహిళా ఉపాధ్యక్షుడిగా కవిత ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కమిటీ నిరంతరం కృషి చేస్తుందని విజయ్‌కుమార్ తెలిపారు.

◆ **20న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్**

జహీరాబాద్ టౌన్: వెలాసిటీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 20న పట్టణంలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్.రమేష్ తెలిపారు. పట్టణంలోని బ్లాక్ రోడ్డులోని ఇనిస్టిట్యూట్‌లో ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు మాత్రమే టెస్ట్‌లో పాల్గొనాలని చెప్పారు.

◆ **వైభవంగా కార్తీక దీపోత్సవం**

జహీరాబాద్ టౌన్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మార్కండేశ్వర ఆలయంలో కార్తీక మాస దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహికంగా దీపోత్సవంలో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి మనోహర్, కోశాధికారి నాందేవ్, సుప్రియ, శ్యామల పాల్గొన్నారు.

◆ **మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ**

సంగారెడ్డి టౌన్: మగ్గం వర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు డిసెంబర్ 06 నుంచి నెల రోజుల పాటు శిక్షణ, వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

మునిపల్లి(అందోల్): పురుగుల మందుతాగి ఓ వ్యక్తి మృతి ఘటన మండలంలోని తాటిపల్లిలో చోటు చేసుకుంది. బుదేరా ఎస్ రాజేశ్‌నాయక్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెంటాగౌడ్ (55), మానసిక స్థితి సరిగ్గాలేక నవంబర్ 30న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శాంతి నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలసి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధరించడం వల్ల భక్తి భావంతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవితం అలవాటు పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గురు స్వాములు నర్ర భిక్షపతి, సంజీవరెడ్డి, సుధాకర్, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్,అధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే వెనుకబడిన వర్గాలకు న్యాయం

కాంగ్రెస్ నేత నీలం మధు


సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని ఆ పార్టీ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో మండల మత్స్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిరువురికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీసీ జనాభా ప్రతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు కీసర శ్రీనివాస్, కాంగ్రెస్ కోనరావుపేట్ మండల్ ప్రెసిడెంట్ ఫిరోజ్ పాషా, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిచ్చలా ఎల్లయ్య, ఫిషరీస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మత్స్యశాఖ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బోధనేతర అంశాల నుంచి మినహాయించాలి

తపస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బోధనేతర అంశాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని మాధవ సదన్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి దుబాషి భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తూ బాధ్యులను చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదని తపస్ కార్యకర్త అందరికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. డిసెంబర్ 17న హైదరాబాద్‌లో జరిగే ధర్మాగ్రహ దీక్షలో జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, ఆడివప్ప రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్, నర్సింహారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్ జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా సంఘటన కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, విజయకుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాపాలన–విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మేథస్సును అభినందిస్తూ అధికారులు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొని పోటీలు నిర్వహించారు.


కల్హేర్: వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు


వట్‌పల్లి: వ్యాస రచన పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


జహీరాబాద్ టౌన్: బహుమతులను అందజేస్తున్న ఎంఈవో బస్వరాజ్


రాయికోడ్: వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈవో అంజయ్య


పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

కేతకీకి పోటెత్తిన భక్తులు


అమృతగుండంలో స్నానం చేస్తున్న భక్తులు


స్వామివారిని దర్శించుకునేందుకు లైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయానికి అమావాస్య, ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. పాత కల పూజ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారికి అభిషేకం, అర్చన, హారతి, వాహన పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అడిషనల్ ఎస్పీ సంజీవరావు ప్రత్యేక పూజలు

కార్తీక అమావాస్యను పురస్కరించుకొని జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు, బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేందర్ బిల్దాలే కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి, సన్మానించారు.